RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 93 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | ఆదివారం 04.10.2026 | పేజీలు : 8

ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ కొనుగోలు చేసి ప్రయాణించిన తెలంగాణ మంత్రులు

- డే పాస్‌తో ఆర్టీసీ బస్సు, మెట్రో రైలులో ప్రయాణించిన మంత్రులు
- బస్సులో బేగంపేట మెట్రోకు చేరుకున్న మంత్రులు
- జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణం



2

కెప్టెన్ స్మిత్‌ను స్వయంగా వెళ్లి పరామర్శించిన దుబాయ్ యువరాజు

- స్మిత్‌ను ఆస్పత్రిలో కలిసిన దుబాయ్ యువరాజు
- ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న హమ్దాన్
- స్మిత్ ధైర్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించిన యువరాజు



2

రేవంత్ కుటుంబ వ్యాపారాలపై విచారణ జరపాలి - బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్

- కాంగ్రెస్ పాలనలో సీఎం కుటుంబ వ్యాపారాలు అమాంతం పెరిగాయని విమర్శ
- మెడికవర్ తదితర సంస్థలపై విచారణకు డిమాండ్
- తన ఆరోపణలు తప్పైతే క్షమాపణ చెబుతానని వ్యాఖ్య



2

మీరు చెప్పేది మేం వింటాం..
ఇదిగో సత్యాగ్రహ వెబ్ సైట్ - రేవంత్ రెడ్డి



- 'సత్యాగ్రహ' పేరుతో కొత్త కార్యక్రమాన్ని ప్రారంభించిన రాహుల్ గాంధీ
- దేశవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలు, ఉద్యమాలను ఏకతాటిపైకి తేవడమే లక్ష్యం
- ప్రత్యేక వెబ్‌సైట్‌లో తమ ఉద్యమ వివరాలు నమోదు చేసేందుకు అవకాశం

నిత్యం నిఘా, హైదరాబాద్ : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక కీలక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా వివిధ సమస్యలపై పోరాడుతున్న వారి గొంతుకలను ఏకం చేసే లక్ష్యంతో 'సత్యాగ్రహ' పేరుతో ఒక కొత్త వేదికను ఆయన ప్రారంభించారు. ఈ విషయాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. దేశవ్యాప్తంగా సత్యం అణచివేతకు గురవుతోందని, దీనికి వ్యతిరేకంగా ప్రజలు తమ గళం విప్పుతున్నారని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. భూమి, మహిళల హక్కులు, దళిత, ఓబీసీల హక్కులు, విద్య, పరీక్షల్లో అక్రమాలు వంటి అనేక .....

2



వరంగల్ ఎయిర్‌పోర్టు పనుల్లో ముందడుగు.. బౌండరీ వాల్‌కు టెండర్ ఖరారు

ప్రహరీ నిర్మాణానికి టెండర్ ఖరారు చేసిన ఏఏఐ

రూ.13.28 కోట్లకే పనులు దక్కించుకున్న సైదాక్స్ ఇన్ఫ్రా

అంచనా కన్నా తక్కువకు బిడ్.. ప్రభుత్వానికి రూ.8 కోట్లు ఆదా

నిత్యం నిఘా, వరంగల్ : వరంగల్ (మామనూరు) ఎయిర్‌పోర్టు అభివృద్ధి పనుల్లో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా మొదటి దశ పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి కాంట్రాక్టు సంస్థను ఖరారు చేసింది. ఎయిర్‌పోర్టుకు కొత్తగా సేకరించిన భూమికి రక్షణ గోడ నిర్మించే పనులను హైదరాబాద్‌కు చెందిన సైదాక్స్ ఇంజనీర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ దక్కించుకుంది. ఈ కాంట్రాక్టును సెప్టెంబర్ 29న ఖరారు చేశారు. ఈ పనుల కోసం ఏఏఐ రూ.21.39 కోట్లను అంచనా వ్యయంగా నిర్ణయించగా, సైదాక్స్ సంస్థ కేవలం రూ.13.28 కోట్లకే పనులు పూర్తి చేస్తామని...

మిగతా 2వ పేజీ లో..

రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసింది : హరీశ్ రావు

- నర్సాపూర్‌లో బీఆర్ఎస్‌లో చేరిన పలువురు కాంగ్రెస్ నేతలు
- రోడ్ల మరమ్మతులు కూడా చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్న హరీశ్ రావు
- ఫ్యూచర్ సిటీ ఫ్యూచర్ లేని సిటీ అని ఎద్దేవా



నిత్యం నిఘా, మెదక్ : మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంలో పలువురు కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన నేతలకు మాజీ మంత్రి హరీశ్ రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ శకం ముగిసిందని అన్నారు. సాధారణంగా ప్రతిపక్షం నుంచి అధికార పక్షంలోకి వలసలు ఉంటాయని, కానీ ఎన్నికలకు ఇంకా రెండేళ్ల సమయం ఉన్నప్పటికీ అధికార కాంగ్రెస్ నుంచి నేతలు ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌లోకి రావడం అసాధారణమని వ్యాఖ్యానించారు. మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో కనీసం రోడ్ల మరమ్మతులు కూడా చేపట్టలేదని, రోడ్లు గుంతలమయంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల వైఫల్యం కారణంగా ప్రజలు కాంగ్రెస్ నేతలను నిలదీస్తున్నారని, ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటున్న పార్టీలో ఉండటం కంటే కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడమే మేలని భావించి కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని హరీశ్ రావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెబుతున్న 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టును ఆయన 'ఫ్యూచర్ లేని సిటీ'గా ఎద్దేవా చేశారు. ఇప్పటికే ఉన్న నివాస ప్రాంతాల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా, ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టడం ఏంటని ఆయన మండిపడ్డారు.

తెలంగాణలో దసరా సెలవులు ఖరారు..

- పాఠశాలలకు 13 రోజులు,
- కాలేజీలకు 12 రోజులు



పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22 వరకు మొత్తం 13 రోజుల సెలవులు

జూనియర్ కాలేజీలకు అక్టోబర్ 10 నుంచి 21 వరకు 12 రోజుల పాటు సెలవులు

అక్టోబర్ 23న స్కూళ్లు, 22న కాలేజీలు తిరిగి పునఃప్రారంభం

సెలవులకు ముందు రోజే ముగియనున్న సమ్మెటివ్-1 పరీక్షలు

2

లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి : మల్లికార్జున ఖర్గే



దేశంలో జరిగినవన్నీ అక్రమ ఎన్నికలేనన్న ఖర్గే

మోదీ, అమిత్ షాతో పాటు అందరూ అక్రమంగా పదవుల్లో ఉన్నారని వ్యాఖ్య

ఈవీఎంల దుర్వినియోగం జరిగిందని ఆరోపణ

2

నా పోటీ హుజూర్‌నగర్ నుంచే.. వదంతులు నమ్మొద్దు : మంత్రి ఉత్తమ్


- వచ్చే ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచే పోటీ చేస్తానని స్పష్టం చేసిన ఉత్తమ్
- తుంగతుర్తి నియోజకవర్గానికి మారుతున్నాననే వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి
- కాళేశ్వరం డిజైన్ లో లోపాలు ఉంటే ప్రభుత్వమే ఖర్చు భరిస్తుందని వెల్లడి



2

ఫ్లైదుబాయ్ పైలట్ మచ్చర్ సాహసంపై రాహుల్ గాంధీ మౌనం.. - బీజేపీ నేతల తీవ్ర విమర్శలు

- ఫ్లైదుబాయ్ పైలట్ ధైర్యాన్ని పొగడని రాహుల్ గాంధీపై బీజేపీ విమర్శలు
- ప్రాణాలు పణంగా పెట్టిన పైలట్‌పై రాహుల్ ఒక్క పోస్ట్ పెట్టలేదన్న కిషన్ రెడ్డి
- మోదీ పైలట్‌తో మాట్లాడారని, రాహుల్ మౌనంగా ఉన్నారని రామచందర్ రావు వ్యాఖ్య





నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : ఫ్లైదుబాయ్ విమానంలో కో-పైలట్ చేతిలో కత్తిపోట్లకు గురైనా, ధైర్యంగా విపత్తును నివారించి ప్రయాణికులను కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అభినందించడం లేదంటూ బీజేపీ నేతలు టార్గెట్ చేశారు. పైలట్ ధైర్యాన్ని గుర్తించడంలో రాహుల్ విఫలమయ్యారంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ, "మరో 9/11 తరహా ఘటనను తన ప్రాణాలను పణంగా పెట్టి నివారించిన పైలట్ గురించి రాహుల్ గాంధీ ఒక్క పోస్ట్ కూడా పెట్టలేదు,...

2

మీరు చెప్పేది మేం వింటాం.. ఇదిగో సత్యాగ్రహ వెబ్ సైట్ : సీఎం రేవంత్ రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. అంశాలపై ప్రజలు నిరసనలు తెలుపుతున్నారని తెలిపింది. ఇలా దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ఉద్యమాలను ఒకే మ్యాప్‌పైకి తీసుకువచ్చి, వాటిని సమన్వయం చేసేందుకు 'సత్యాగ్రహ' కార్యక్రమాన్ని రూపొందించినట్లు రాహుల్ గాంధీ తెలిపారు. ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా ఒక వెబ్‌సైట్‌ను కూడా అందుబాటులోకి తెచ్చారు. తమ సమస్యలు, పోరాటాలకు సంబంధించిన వివరాలను ఈ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసి, నిర్దేశిత ఫారం నింపడం ద్వారా ఉద్యమకారులు తమ గళాన్ని జాతీయ స్థాయిలో వినిపించేందుకు అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళుతూ సీఎం రేవంత్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "మీ గళాన్ని మేం వింటాం, మీతో కనెక్ట్ అవుతాం. సత్యం, న్యాయం కోసం మీరు చేస్తున్న పోరాటానికి మా పూర్తి మద్దతు ఉంటుంది. 'సత్యాగ్రహ' వెబ్‌సైట్‌ను సందర్శించి మీ ఉద్యమ వివరాలను నమోదు చేయండి" అని ఆయన పిలుపునిచ్చారు. వివిధ ప్రాంతాల్లో విడి విడిగా జరుగుతున్న స్థానిక ఉద్యమాలకు జాతీయ స్థాయిలో మద్దతు కూడగట్టి, వాటిని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది.

రేవంత్ కుటుంబ వ్యాపారాలపై విచారణ జరపాలి - మన్నె క్రిశాంక్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ తీవ్ర ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండున్నరేళ్లలో సీఎం కుటుంబానికి సంబంధించిన వ్యాపారాలు అమాంతం విస్తరించాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి కుటుంబంతో సంబంధం ఉన్న మెడికవర్ హాస్పిటల్స్, మ్యాక్స్ బీఎన్ ఫార్మా, మైండ్ వాల్ కన్‌స్ట్రక్షన్స్, శోదా కన్‌స్ట్రక్షన్స్, స్వచ్ బయో, టెసరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ వంటి సంస్థలు వేగంగా అభివృద్ధి చెందాయని క్రిశాంక్ ఆరోపించారు. ఈ కంపెనీలు భారీ అవకతవకలకు పాల్పడుతున్నాయని, దీనికి సంబంధించిన పత్రాలను ఈడీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాని కార్యాలయం, రాష్ట్రపతి కార్యాలయాలతో పాటు ప్రతిపక్ష నేతలకూ అందజేస్తానని తెలిపారు. ఈ ఆరోపణలపై విచారణకు ముఖ్యమంత్రి ఆదేశించాలని క్రిశాంక్ డిమాండ్ చేశారు. కొన్ని కంపెనీలలో దుంప శిరీష డైరెక్టర్‌గా ఉండటం వెనుక ఉన్న పాత్రను కూడా తేల్చాలన్నారు. తన ఆరోపణలు అవాస్తవమని తేలితే, మరోసారి ప్రెస్ మీట్ పెట్టి రేవంత్ రెడ్డి కుటుంబానికి బహిరంగ క్షమాపణ చెబుతానని స్పష్టం చేశారు. ఇలాంటి అంశాలను ప్రస్తావిస్తున్నందుకే తనను రెండుసార్లు జైలుకు పంపారని, తన ఇంటి తలుపులు పగలగొట్టారని, తన బిడ్డను కూడా బెదిరించారని క్రిశాంక్ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, తెలంగాణలో అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య ఆస్తులు, భూముల విషయంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు కొనసాగుతున్న నేపథ్యంలో క్రిశాంక్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

తెలంగాణలో దసరా సెలవులు ఖరారు..

పాఠశాలలకు 13 రోజులు, కాలేజీలకు 12 రోజులు

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలోని విద్యార్థులకు దసరా పండుగ సెలవులను రాష్ట్ర విద్యాశాఖ ఖరారు చేసింది. 2026 విద్యా సంవత్సరానికి గాను పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు వేర్వేరుగా సెలవుల తేదీలను శనివారం ప్రకటించింది. ఈసారి పాఠశాలలకు 13 రోజుల పాటు, ఇంటర్మీడియట్ కళాశాలలకు 12 రోజుల పాటు దసరా సెలవులు రానున్నాయి. విద్యాశాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు అక్టోబర్ 10 నుంచి 22వ తేదీ వరకు 13 రోజుల పాటు సెలవులు ఉంటాయి. సెలవుల అనంతరం అక్టోబర్ 23న పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి. ఇక జూనియర్ కళాశాలల (ఇంటర్మీడియట్) విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచి 21వ తేదీ వరకు మొత్తం 12 రోజులు సెలవులు ప్రకటించారు. వీరికి అక్టోబర్ 22న తిరిగి తరగతులు ప్రారంభమవుతాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో సమ్మెటివ్ అసెస్‌మెంట్-1 (SA-1) పరీక్షలు జరుగుతున్నాయి. ఈ పరీక్షలు అక్టోబర్ 9వ తేదీతో ముగియనున్నాయి. అదే రోజున జరగాల్సిన 9వ తరగతి ఇంగ్లీష్ పరీక్ష సమయాన్ని అధికారులు మార్చారు. ఈ పరీక్ష ఉదయం 9:15 గంటల నుంచి మధ్యాహ్నం 12:15 గంటల వరకు జరుగుతుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. పరీక్షలు ముగిసిన మరుసటి రోజు నుంచే విద్యార్థులకు దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి.

నా పోటీ హుజూర్‌నగర్ నుంచే.. వదంతులు నమ్మొద్దు : మంత్రి ఉత్తమ్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. వచ్చే ఎన్నికల్లో తాను హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని ఆయన స్పష్టం చేశారు. డీలిమిటేషన్ తర్వాత తుంగతుర్తికి మారవచ్చంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం ఉత్తమ్ కుమార్ రెడ్డి హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈరోజు హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన ఉత్తమ్ కుమార్ రెడ్డి... తన నియోజకవర్గం మార్పుపై వస్తున్న వదంతులను ఎవరూ నమ్మవద్దని కోరారు. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని తన స్వగ్రామం తాటిపాములలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని, అంతమాత్రాన అక్కడి నుంచి పోటీ చేస్తాననడం అవాస్తవమని తెలిపారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు మరమ్మతులపై కూడా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రాజెక్టులోని మూడు బ్యారేజీల పునరుద్ధరణలో డిజైన్‌కు సంబంధించిన లోపాలుంటే, ఆ ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని స్పష్టం చేశారు. అయితే, నిర్మాణ ఏజెన్సీల పరిధిలోకి వచ్చే సమస్యలు ఏవైనా ఉంటే, వాటిని ఆయా సంస్థలే సొంత ఖర్చుతో సరిచేయాల్సి ఉంటుందని ఆయన వివరించారు.

వరంగల్ ఎయిర్‌పోర్టు పనుల్లో ముందడుగు.. - బౌండరీ వాల్‌కు టెండర్ ఖరారు

మొదటిపేజీ తరువాయి..
బిడ్ దాఖలు చేసింది. ఇది అంచనా వ్యయం కంటే 37.89 శాతం తక్కువ. దీనివల్ల ప్రభుత్వానికి దాదాపు రూ.8.10 కోట్లు ఆదా కానుంది. కాంట్రాక్టు ప్రకారం, కొత్తగా సేకరించిన 283 ఎకరాల భూమి చుట్టూ ప్రీకాస్ట్ బౌండరీ వాల్ నిర్మించడంతో పాటు, పాత ప్రహరీ ఎత్తును కూడా పెంచనున్నారు. బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ (బీసీఏఎస్) నిబంధనలకు అనుగుణంగా ఈ పనులు జరుగుతాయి. అక్టోబర్ 9న పనులు ప్రారంభించి, 15 నెలల్లోగా పూర్తి చేయాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం, అక్టోబర్ 14లోపు సైదాక్స్ కంపెనీ ప్రతినిధులు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టులోని ఏఏఐ కార్యాలయంలో అధికారిక ఒప్పందంపై సంతకాలు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం రూ.285 కోట్లతో భూసేకరణ పూర్తి చేసి ఏఏఐకి అప్పగించిన విషయం తెలిసిందే. ప్రహరీ పనుల తర్వాత టెర్మినల్ బిల్డింగ్, ఏటీసీ టవర్ వంటి ఇతర ముఖ్యమైన నిర్మాణాలకు కూడా టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. 2028 జూన్ నాటికి ఎయిర్‌పోర్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

ప్లేదుబాయ్ పైలట్ మచ్చర్ సాహసంపై రాహుల్ గాంధీ మౌనం.. - బీజేపీ నేతల తీవ్ర విమర్శలు

మొదటిపేజీ తరువాయి..
మాట్లాడలేదు" అని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా నేతలు పైలట్‌ను అభినందిస్తుంటే గాంధీ కుటుంబం ఎందుకు మౌనంగా ఉందని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా పైలట్‌తో వీడియో కాల్‌లో మాట్లాడి అభినందించారని గుర్తు చేశారు. కానీ ప్రధాన ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ కనీసం ఈ ఘటనపై స్పందించక పోవడం, ట్వీట్ చేయకపోవడం తేడాను స్పష్టంగా చూపిస్తోందని అన్నారు. ఇదే 'దేశం ప్రథమం' అనే తమ సిద్ధాంతానికి, వారి వైఖరికి ఉన్న వ్యత్యాసమని పేర్కొన్నారు. దేశం మొత్తం పైలట్‌ను ప్రశంసిస్తుంటే రాహుల్ గాంధీ మౌనం అనుమానాస్పదంగా ఉందని పలువురు జాతీయ బీజేపీ అధికార ప్రతినిధులు వ్యాఖ్యానించారు. మరికొందరు నేతలు రాహుల్ వైఖరిని "ఓటు బ్యాంకు రాజకీయాలకు" నిదర్శనమని ఆరోపించారు.



ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ కొనుగోలు చేసి ప్రయాణించిన తెలంగాణ మంత్రులు

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క పలువురు మంత్రులతో కలిసి ఈరోజు మెట్రో రైలు, ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. ఈ సందర్భంగా భట్టివిక్రమార్క మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ రవాణాను మరింత సులభతరం చేయడం కోసం ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ తీసుకొచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో దీనిని ఆటోలు, క్యాబ్‌లకు అనుసంధానించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. శనివారం డే పాస్‌తో మంత్రులతో కలిసి ఆయన ఆర్టీసీ బస్సులో బేగంపేట మెట్రో స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడి



నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా తనతో పాటు ప్రయాణించిన మంత్రులకు, భట్టి విక్రమార్క కాంబో పాస్ కొనుగోలు చేశారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం, ప్రజా రవాణా వైపు ప్రయాణికులను ఆకర్షితులను చేయడం కోసం ఈ పాస్ తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. ప్రస్తుతం వీటిని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని వెల్లడించారు. ప్రజలపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని తెలిపారు. కాంబో పాస్‌పై ప్రయాణించిన మంత్రుల్లో వివేక్, అజారుద్దీన్ తదితరులు ఉన్నారు.

కెప్టెన్ స్మిత్‌ను స్వయంగా వెళ్లి పరామర్శించిన దుబాయ్ యువరాజు

మొదటిపేజీ తరువాయి.. ప్రాణాలను లెక్కచేయకుండా విమానంలోని 174 మందిని కాపాడిన భారత పైలట్ కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను దుబాయ్ యువరాజు షేక్ హమ్దాన్ బిన్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ స్వయంగా వెళ్లి పరామర్శించారు. దుబాయ్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న స్మిత్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. స్మిత్‌ను కలిసిన అనంతరం యువరాజు ఆయన ధైర్యాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. స్మిత్‌పై తమకు పూర్తి గౌరవం, అభిమానం ఉన్నాయని తెలిపారు. యూఏఈ నాయకత్వం కూడా ఆయనను గర్వంగా చూస్తోందని చెప్పారు. స్మిత్ యూఏఈ విలువలకు ప్రతీకగా నిలిచారని యువరాజు పేర్కొన్నారు. దయ, శాంతి, మానవ ప్రాణాలకు విలువ ఇచ్చే దేశంగా యూఏఈ నిలుస్తుందని చెప్పారు. స్మిత్‌తో మాట్లాడుతున్న ఫొటోలను యువరాజు సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆయనను ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్న దృశ్యాలు కూడా అందులో కనిపించాయి. విమానంలో సహ పైలట్ దాడి చేయడంతో స్మిత్ తీవ్రంగా గాయపడ్డ విషయం తెలిసిందే. విమానాన్ని కూల్చేందుకు ప్రయత్నించిన సహ పైలట్‌ను అడ్డుకునేందుకు ఆయన గాయాలతో వీరోచితంగా పోరాడారు. అనంతరం కాక్‌పిట్ తలుపు తెరవడంతో ప్రయాణికులు లోపలికి వెళ్లి దాడిచేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనలో విమానంలోని 174 మంది ప్రయాణికులు, సిబ్బంది ప్రాణాలను కాపాడటంలో స్మిత్ కీలక పాత్ర పోషించారు. తీవ్ర గాయాల మధ్య కూడా ఆయన చూపిన ధైర్యంపై ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయి.

లోక్‌సభ, అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలి : మల్లికార్జున ఖర్గే

మొదటిపేజీ తరువాయి.. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేస్తూ, తీవ్రమైన డిమాండ్‌ను తెరపైకి తెచ్చారు. దేశంలో జరిగిన ఎన్నికలన్నీ అక్రమమని ఆరోపిస్తూ, లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కర్ణాటకలోని కలబుర్గిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ప్రస్తుత పాలన మొత్తం చట్టవిరుద్ధమైన ఎన్నికల పునాదిపైనే నడుస్తోందని ఆరోపించారు. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్)లో జరుగుతున్న అవకతవకల కారణంగానే ఈ డిమాండ్ చేస్తున్నట్లు ఖర్గే స్పష్టం చేశారు. "ఈ రోజు దేశం మొత్తం అక్రమ ఎన్నికల ద్వారానే నడుస్తోంది. మోదీ అక్రమ ప్రధాని, అమిత్ షా అక్రమ మంత్రి అని, దేశంలో ఎన్నికైన ముఖ్యమంత్రులందరూ అక్రమంగా ఆ పదవుల్లో ఉన్నట్లేనని అన్నారు. వాటన్నింటినీ రద్దు చేసి, కేవలం బ్యాలెట్ పత్రాలతోనే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలి" అని చెప్పారు. ఈ అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీతో పాటు ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలతో కూడా చర్చించినట్లు ఖర్గే తెలిపారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించామని, అందులో భాగంగా అక్టోబర్ 6వ తేదీన ఢిల్లీలో విపక్ష ఎంపీలందరూ కలిసి ఎన్నికల సంఘం కార్యాలయానికి నిరసన ర్యాలీ నిర్వహిస్తారని వివరించారు. ఓటర్ల జాబితా నుంచి కొన్ని వర్గాల ప్రజల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనిపై యువతలో చైతన్యం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కేదారి కుటుంబానికి రూ.10 లక్షల సీఎంఆర్ఎఫ్ సాయం

- **ఉద్యమకారులను గుర్తించి అండగా నిలుస్తున్న ప్రజా ప్రభుత్వం:ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి**



హనుమకొండ, అక్టోబర్03 (నిత్యం నిఘా ప్రతినిధి): ఇటీవల ప్రమాద వశాత్తు మృతి చెందిన లింగాల కేదారి, పుష్పలత దంపతుల కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.10 లక్షల ఆర్థిక సాయం చెక్కును శనివారం ఎమ్మెల్యేలు అందజేశారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కేదారి కుటుంబ సభ్యుల ఇంటికి వెళ్లి చెక్కును అందజేయడంతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమకారులకు ఆపన్నహస్తం అందిస్తూ లింగాల కేదారి అండగా నిలిచారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి కుటుంబానికి ఆర్థిక చేయూత అందించిందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొని పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గౌరవిస్తుందని, రానున్న రోజుల్లోనూ ఉద్యమకారులకు అండగా ఉంటుందని అన్నారు. కేదారి కుటుంబం ప్రస్తుత కష్టకాలంలో తాను వ్యక్తిగతంగా కూడా అండగా ఉంటానని, కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటానని భరోసా ఇచ్చారు. కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి నాయిని రాజేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి, ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడానికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

వయోవృద్ధులు దిక్సూచి లాంటి వారు

- **కన్నవారిని భారంగా భావించవద్దు.. బాధ్యతగా చూసుకోవాలి: కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**







హనుమకొండ, అక్టోబర్03 (నిత్యం నిఘా ప్రతినిధి); వయోవృద్ధులు సమాజానికి దిక్సూచి లాంటి వారని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సమన్వయంతో జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.విశ్వజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో వారం రోజులుగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల్యం నుంచి ఎదిగి కూతురు, కొడుకు, తల్లి, తండ్రి, అమ్మమ్మ, నానమ్మ, తాతయ్య వంటి ఎన్నో బాధ్యతలను నిర్వర్తిస్తూ జీవితాన్ని కుటుంబం కోసం ధారపోసిన వారిని వృద్ధాప్యంలో బాగా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కన్నవారిని భారంగా భావించకుండా బాధ్యతగా చూసుకోవాలని సూచించారు. ఉద్యోగ బాధ్యతల నుంచి పదవీ విరమణ చేసిన వారు ఉద్యోగానికి మాత్రమే విరమణ పొందారని, తమ జీవిత అనుభవాలను ఇతరులకు పంచడంలో ఎప్పటికీ విరమించలేదని అన్నారు. వయోవృద్ధులకు ప్రభుత్వపరంగా అందాల్సిన ప్రతి సంక్షేమ పథకం అందేలా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వయోవృద్ధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రస్థాయిలో ఇటీవల పురస్కారం పొందిన సీనియర్ సిటిజన్ ఫోరం కమిటీ సభ్యులను కలెక్టర్ ఈ సందర్భంగా అభినందించారు. నాగులగాం నర్సయ్య, నాగమ్మ దంపతులు 'జననీ శివకామిని' భక్తి గీతాన్ని ఆలపించగా కలెక్టర్ ఆసాంతం విని వారిని అభినందించారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ బి.శేషాద్రి మాట్లాడుతూ అన్ని బంధాలను ఆదర్శంగా నిలబెట్టిన వ్యక్తులు, అపారమైన అనుభవాల సారంగల వ్యక్తులు వయోవృద్ధులని అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను మాట్లాడుతూ జిల్లాలో 281 వృద్ధుల సంఘాలను ఏర్పాటు చేసి 2,870 మంది సభ్యులను చేర్చినట్లు తెలిపారు. సంఘాల ద్వారా సమావేశాలు నిర్వహించడం, పొదుపులు, అంతర్గత రుణాలు అందించడం, ప్రభుత్వ పథకాలను చేరువ చేయడం జరుగుతోందన్నారు.జిల్లా సంక్షేమ అధికారి ఎం.విశ్వజ మాట్లాడుతూ కలెక్టర్ సహకారంతో జిల్లాలో మూడు వయోవృద్ధుల పగటి సంరక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. వీటి ద్వారా వయోవృద్ధులకు భౌతిక చికిత్సతో పాటు ఇతర ఆరోగ్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, సీనియర్ సిటిజన్ ట్రిబ్యునల్ బెంచ్ సభ్యురాలు అనితారెడ్డి, అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి వెంకటేష్, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్ సమ్మయ్య, సెర్ప్ కార్యక్రమ నిర్వాహకుడు కరుణాకర్, సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు దామెర నర్సయ్య, సంక్షేమ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ చంద్రమౌళి, మండల పరశురాములు, విడిపిపోలు స్వాతి, స్వరూప, సింధురాణి, అవంతి, సీనియర్ సహాయకుడు వి.వెంకట్‌రామ్, ఎఫ్ఆర్వో రవికృష్ణ, ఇన్‌చార్జి డీసీపీవో ఎస్.ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామప్ప శిల్పవైభవానికి విదేశీ ప్రతినిధుల ప్రశంసలు

- **కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం, శిల్పుల కళానైపుణ్యం అద్భుతమని కొనియాడిన బృందం**



ములుగు, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ శిల్పవైభవాన్ని విదేశీ ప్రతినిధులు ప్రశంసించారు. కాకతీయుల నిర్మాణ పరిజ్ఞానం, శిల్పుల కళానైపుణ్యం అద్భుతమని కొనియాడారు. అంతర్జాతీయ శిక్షణ కార్యక్రమంలో భాగంగా 18 దేశాలకు చెందిన 28 మంది విదేశీ అధికారులు, పాత్రికేయులతో కూడిన బృందం శనివారం ములుగు జిల్లాలోని యునెస్కో ప్రపంచ వారసత్వ సంపద రామప్ప దేవాలయాన్ని సందర్శించింది. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని భారత సాంకేతిక, ఆర్థిక సహకార కార్యక్రమం కింద హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ నిర్వహిస్తున్న రెండు వారాల సామర్థ్య వికాస శిక్షణలో భాగంగా ఈ అధ్యయన పర్యటన చేపట్టారు. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 10 వరకు శిక్షణ కొనసాగుతోంది. అల్జీరియా, భూటాన్, కాంబోడియా, ఈక్వడార్, ఫిజీ, ఘనా, లైబీరియా, మాల్దీవులు, మారిషస్, మొజాంబిక్, సీషెల్స్, సియెర్రా లియోన్, శ్రీలంక, టోగో, ఉజ్బెకిస్తాన్, వియత్నాం, జాంబియా, జింబాబ్వే దేశాలకు చెందిన అధికారులు, పాత్రికేయులు బృందంలో ఉన్నారు. రామప్ప దేవాలయ విశిష్టత, ప్రపంచ వారసత్వ గుర్తింపు ప్రాధాన్యం, శిల్పుల నైపుణ్యం, నిర్మాణ పద్ధతులను ఆలయ గైడ్ ప్రతినిధులకు వివరించారు. భూకంపాలను తట్టుకునేలా ఇసుక పునాది సాంకేతికతను వినియోగించడం, గోపుర నిర్మాణంలో బరువును తగ్గించేందుకు తేలికపాటి ఇటుకలను ఉపయోగించడం వంటి కాకతీయుల నిర్మాణ నైపుణ్యాలను తెలుసుకుని విదేశీ ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నల్లరాతిపై సున్నితమైన నగిషీలతో చెక్కిన శిల్పాలు, నాట్య భంగిమలతో కూడిన శిల్పాలను వారు ఆసక్తిగా తిలకించారు. సూది బెజ్జం దూరేంత సన్నని రంధ్రాలతో కూడిన శిల్పకళను ప్రత్యేకంగా పరిశీలించారు. సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు వెలుగు మారుతున్నప్పటికీ గర్భగుడిలోని శివలింగంపై వెలుగు పడేలా రూపొందించిన కాకతీయుల ఖగోళ, వాస్తు నైపుణ్యాన్ని కొనియాడారు.రామప్పలోని ప్రతి శిల్పం ఆనాటి శిల్పుల ప్రతిభను, భారతీయ సంస్కృతి వైభవాన్ని భావి తరాలకు చాటిచెబుతోందని ప్రతినిధులు ప్రశంసించారు. కాకతీయుల సాంకేతిక పరిజ్ఞానం, నిర్మాణ శైలి, కళానైపుణ్యం అద్భుతంగా ఉన్నాయని పేర్కొన్నారు.కార్యక్రమంలో పర్యటన సమన్వయ అధికారి, జిల్లా పౌర సంబంధాల అధికారి రఫిక్, పర్యాటక సమన్వయ అధికారి ధర్మానాయక్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రుల ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం

- **ఈ నెల 11 నుంచి 21 వరకు భద్రకాళి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు**



హనుమకొండ, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి); హనుమకొండలోని శ్రీ భద్రకాళి దేవాలయంలో నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయికి ఆలయ కార్యనిర్వహణ అధికారి సునీత, ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆహ్వాన పత్రికను అందజేశారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి ఉత్సవాల వివరాలను తెలియజేసి ఆహ్వానించారు. భద్రకాళి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రుల మహోత్సవాలు ఈ నెల 11 నుంచి 21వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు, కల్యాణోత్సవం, ఊరేగింపు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. శరన్నవరాత్రుల సందర్భంగా నిర్వహించే వివిధ ప్రత్యేక కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి హాజరై అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆలయ ఈవో, ప్రధాన అర్చకులు కోరారు.

అంగన్‌వాడీలో పోషణ మాసం.. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం



ములుగు జిల్లా/ మల్లంపల్లి, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి) : పోషణ మాసం సందర్భంగా మల్లంపల్లి స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం చిన్నారులకు సామూహిక అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మల్లంపల్లి సర్పంచ్ ల్యాద శ్యామ్‌రావు హాజరై చిన్నారులకు అన్నప్రాసన చేయించడంతో పాటు అక్షరాభ్యాస కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు తొలి అడుగులని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం, బాలామృతం తదితర పౌష్టిక పదార్థాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించడంతో పాటు అక్షరాభ్యాసం చేయించారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమార్, వార్డు సభ్యుడు పాషా, కొంగరి నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవేంద్రచారి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, బాలింతలు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రెండు డీఏలు విడుదల చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు

- **మిగిలిన ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను కూడా పరిష్కరించాలి: టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గాజే వేణుగోపాల్**



వరంగల్, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పెండింగ్ డీఏల్లో రెండు డీఏలను విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం పట్ల వరంగల్ టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు గాజే వేణుగోపాల్, కార్యదర్శి పాలకుర్తి సదానందం హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రివర్గ సభ్యులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శికి టీఎన్జీవో వరంగల్ జిల్లా శాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు.మిగిలిన ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలను కూడా ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు. ముఖ్యంగా వేతన సవరణ సంఘం నివేదికను తెప్పించుకుని 51 శాతం ఫిట్‌మెంట్‌తో నూతన వేతన సవరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిన పెండింగ్ డీఏలను విడుదల చేయడంతో పాటు పెండింగ్ బిల్లుల కోసం ఎదురుచూస్తున్న ఉద్యోగులు, పెన్షనర్ల బిల్లులను మంజూరు చేయాలని కోరారు. అలాగే కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని, ఆరోగ్య కార్డుల అమలులో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వంపై అదనపు ఆర్థిక భారం లేని ఉద్యోగుల సమస్యలను కూడా ప్రత్యేకంగా పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ సంఘాల ఐక్య కార్యాచరణ సమితికి ఇచ్చిన హామీ మేరకు రెండు డీఏలను ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. హుస్సేనీ ముజీబ్‌లకు కూడా వారు ధన్యవాదాలు తెలిపారు.

గర్భిణీలకు పౌష్టికాహారం అందించాలి

- **ఆరోగ్యకరమైన జీవనశైలితోనే ఆరోగ్యకరమైన సమాజం: సర్పంచ్ దండేవేన సంధ్యా బాణేష్**



మంథని, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): గ్రామంలోని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించడంపై ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని సర్పంచ్ దండేవేన సంధ్యా బాణేష్ అన్నారు. శనివారం నిర్వహించిన జాతీయ పోషణ అభియాన్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రక్తహీనతను నివారించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం పోషణ అభియాన్ ప్రధాన ఉద్దేశమని సర్పంచ్ తెలిపారు. పిల్లలు ఆరోగ్యంగా ఉంటేనే గ్రామం అభివృద్ధి చెందుతుందని, అందువల్ల ప్రతి తల్లి పిల్లలకు సమతుల్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఆకుకూరలు, పప్పులు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు వంటి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందుబాటులో ఉన్న మేరకు ప్రతిరోజూ తీసుకోవాలని సూచించారు. తల్లి ఆరోగ్యంగా, ప్రతి కుటుంబం ఆనందంగా ఉండేలా గ్రామ పంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో సీడీపీవో పుష్పలత, పర్యవేక్షకురాలు సరిత, అంగన్‌వాడీ టీచర్లు బరిబద్దుల స్వరూప, మట్ట శారద, వంగళూరి కళావతి, అక్కపాక వరుణ, రమాదేవి, ఉప సర్పంచ్ ఎల్క లక్షి , వార్డు సభ్యురాలు దేవుళ్ల లక్షి , గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆపదలో అండగా మంత్రి శ్రీధర్‌బాబు

- **అనారోగ్యంతో చికిత్స పొందుతున్న వ్యక్తికి రూ.3 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు**



మంథని, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆపదలో ఉన్న కుటుంబానికి రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అండగా నిలిచారు. మంథని మండలం ఖాన్సాయిపేట గ్రామానికి చెందిన మెరుగు రాజయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల కోసం ఆర్థిక సాయం కోరడంతో మంత్రి శ్రీధర్‌బాబు స్పందించి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3 లక్షల విలువైన ఎల్ఓసీని మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆయన ఆస్పత్రి సహాయకులు ఎల్ఓసీని రాజయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. వైద్య చికిత్సకు ఆర్థిక సాయం అందించిన మంత్రి శ్రీధర్‌బాబుకు రాజయ్య కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రాజయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి


- **సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**



హనుమకొండ, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): ఆర్టీసీ సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమని, వారు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున కృషి చేస్తామని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి తెలిపారు. ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం వరంగల్ ఒకటి, వరంగల్ రెండు డిపోలలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిపోల్లో కార్మికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, బకాయిల చెల్లింపులు తదితర అంశాలపై నాయకులు కార్మికులతో చర్చించారు. ఆర్టీసీని పునరుద్ధరించడంతో పాటు ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంలో కార్మికుల శ్రమ ఎంతో ఉందని అన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ముఖ్యమంత్రి, సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రానున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ అనుబంధ సంఘానికి మద్దతు తెలిపి గెలిపించాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, డిపో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవోదయలో 9, 11వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

- **అక్టోబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ.. ఏప్రిల్ 10, 2027న ప్రవేశ పరీక్ష**


NAVODAYA VIDYALAYA SAMITI
An Autonomous Organization under Ministry of Education
B-15, Sector-62, Gautam Buddha Nagar
Noida, Uttar Pradesh-201309

NOTIFICATION FOR EXTENSION OF LAST DATE
FOR SUBMISSION OF APPLICATIONS FOR CLASSES IX & XI LEST-2027

Online Registration portal for Lateral Entry Selection Test (LEST)-2027 for admission to classes IX & XI for the session (2027-28) was launched on 01.09.2026. **The last date of submission of online application is further extended up to 15.10.2026.** The candidates may apply free of cost by visiting the following links:
For class IX: https://cbseitms.nic.in/2026/nvsix_9
For class XI: https://cbseitms.nic.in/2026/nvsxi_11

ISSUED BY NAVODAYA VIDYALAYA SAMITI

వరంగల్, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2027–28 విద్యా సంవత్సరానికి 9వ, 11వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే లేటరల్ ఎంట్రీ ఎంపిక పరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల 15 వరకు పొడిగించినట్లు పీఎం శ్రీ పాఠశాల–జవహర్ నవోదయ విద్యాలయం, మామునూరు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.రమేష్ తెలిపారు. జవహర్ నవోదయ విద్యాలయాలు పూర్తిగా ఉచిత విద్యను అందించే సహవిద్యా, నివాస పాఠశాలలని తెలిపారు. 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు సీబీఎస్ఈ అనుబంధంతో ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యప్రణాళిక ఆధారంగా ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన కొనసాగుతుందని వివరించారు. విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. 9వ తరగతి ప్రవేశానికి అర్హత:
2026–27 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థి జన్మతేది 2012 మే 1 నుంచి 2014 జూలై 31 మధ్య ఉండాలి. ప్రవేశం కోరుతున్న నవోదయ విద్యాలయం ఉన్న అదే జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 8వ తరగతి చదివి విద్యా సంవత్సరం పూర్తి చేయాలి.

11వ తరగతి ప్రవేశానికి అర్హత:
2026–27 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులు. విద్యార్థి జన్మతేది 2010 జూన్ 1 నుంచి 2012 జూలై 31 మధ్య ఉండాలి. నవోదయ విద్యాలయం ఉన్న అదే జిల్లాలోని ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 10వ తరగతి చదివి విద్యా సంవత్సరం పూర్తి చేయాలి.

ముఖ్యమైన తేదీలు:
ఆన్‌లైన్ దరఖాస్తుల చివరి తేదీ అక్టోబర్ 15, 2026 కాగా, 9వ, 11వ తరగతుల ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 10, 2027న నిర్వహించనున్నట్లు తెలిపారు.
ప్రవేశాల్లో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, పట్టణ ప్రాంత విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయిస్తారని తెలిపారు. విద్యార్థి తన విద్యలో ఏదైనా భాగాన్ని పట్టణ ప్రాంతంలో చదివినట్లయితే పట్టణ ప్రాంత అభ్యర్థిగా పరిగణిస్తారని వివరించారు. గ్రామీణ ప్రాంతం అంటే పాఠశాల గ్రామపంచాయతీ పరిధిలో ఉండటం, పట్టణ ప్రాంతం అంటే పాఠశాల మున్సిపాలిటీ లేదా మహానగరపాలక సంస్థ పరిధిలో ఉండటంగా పరిగణిస్తారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, బాలికలకు కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయని తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు నవోదయ విద్యాలయ సమితి అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ టి.రమేష్ సూచించారు.

తొర్రూరు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ఒంటెద్దు పోకడలు మానుకోవాలి


- **సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు.. ఎజెండాపై తమతో చర్చించలేదని ఆరోపణ**



మహబూబాబాద్/తొర్రూరు, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): తొర్రూరు మున్సిపల్ చైర్మన్, కమిషనర్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం మానుకోవాలని బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. తమకు సమాచారం ఇవ్వకుండా తీర్మానాలు, ఎజెండా అంశాలను నిర్ణయిస్తున్నారని ఆరోపిస్తూ శనివారం నిర్వహించిన మున్సిపల్ సర్వసభ్య సమావేశాన్ని బీఆర్ఎస్ కౌన్సిలర్లు బహిష్కరించారు.అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు మాట్లాడుతూ మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి ముందు కౌన్సిలర్లతో తీర్మానాలు, ఎజెండా అంశాలపై చర్చించాల్సి ఉంటుందని తెలిపారు. అయితే ఇందుకు విరుద్ధంగా చైర్మన్, కమిషనర్ తమకు వారే అంశాలను నిర్ణయించుకుని, సభ్యులతో ఎలాంటి చర్చ లేకుండా సమావేశంలో ఏక పక్షంగా ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ మున్సిపల్ చట్టం ప్రకారం చైర్మన్, కమిషనర్ వ్యవహరించాల్సి ఉన్నప్పటికీ అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కౌన్సిలర్లకు ఎజెండా ప్రతులను అందజేయకుండా సర్వసభ్య సమావేశం నిర్వహించడం సరికాదన్నారు. తొర్రూరు పట్టణ అభివృద్ధికి బీఆర్ఎస్ కౌన్సిలర్లు సహకరించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, అధికార పార్టీకి చెందిన చైర్మన్, కమిషనర్ ప్రతిపక్ష సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవడం లేదని ఆరోపించారు. కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక విషయంలోనూ కమిషనర్ ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని అన్నారు.పట్టణ అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా వ్యక్తిగత ప్రయోజనాల కోసం పాలకవర్గం వ్యవహరిస్తోందని కౌన్సిలర్లు ఆరోపించారు. పాలకవర్గం తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్లు కర్నే నాగరాజు, భూసాని జయమ్మ ఉప్పలయ్య, తూర్పాటి రవి, పేర్ల జంపన్న, చకిలేల అలివేలు, మాడుగుల భవానీలత, అల్లం శ్యామల శ్యామ్, కిన్నెర కవిత సతీష్, ధరావత్ పద్మ కిషన్ నాయక్, మాజీ కౌన్సిలర్లు ధరావత్ జైసింగ్ నాయక్, గుగులోత్ శంకర్, నాయకులు రాయిశెట్టి వెంకన్న, భూసాని ఉప్పలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు తొర్రూరులో విద్యుత్ అంతరాయం

- **ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు పనులు..ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేత**



తొర్రూరు, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి); తొర్రూరు విద్యుత్ ఉపకేంద్రంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరిచేందుకు ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు పనులు చేపడుతున్నట్లు తొర్రూరు డివిజన్ విద్యుత్ ఇంజనీర్ ఎన్. కృష్ణ తెలిపారు. ఇందులో భాగంగా 5 మెగావాట్ల సామర్థ్యం ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను 8 మెగావాట్ల సామర్థ్యానికి పెంచే పనులు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.ఈ పనుల కారణంగా ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తొర్రూరు పట్టణంతో పాటు చింతలపల్లి, పాలకేంద్రం, సోమ్లా తండా, దుబ్బతండా, కొమ్మనపల్లి తండా తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆయన శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సరఫరా మెరుగుపరిచేందుకు చేపడుతున్న ఈ పనులకు వినియోగదారులు సహకరించాలని ఎన్. కృష్ణ కోరారు.

కోయ, గోండి భాషలకు రాజ్యాంగ గుర్తింపు కల్పించాలి

- **8వ షెడ్యూల్‌లో చేర్చాలని డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్**



భద్రాచలం, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రాచీన ఆదివాసీ భాషలైన కోయ, గోండీ భాషలకు రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో స్థానం కల్పించాలని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. భద్రాచలం గిరిజన భవన్‌లో విశ్వ గోండు సమితి ఆధ్వర్యంలో భాషావేత్త మడవి నెహ్రూ పర్యవేక్షణలో 18 రాష్ట్రాల ప్రతినిధులతో నిర్వహిస్తున్న భాషా ప్రామాణీకరణ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గోండుల భాషకు దశాబ్దాలుగా రాజ్యాంగ గుర్తింపు లభించకుండా రాజకీయ కారణాలతో అణచివేస్తున్నారని డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ ఆరోపించారు. గోండి భాష అభివృద్ధి చెందితే ఆదివాసీల చరిత్ర, సంస్కృతి, మూలాలు మరింత వెలుగులోకి వస్తాయనే కారణంతోనే పాలకుల నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆయన విమర్శించారు. కోయ, గోండి భాషలకు గుర్తింపు కల్పించే అంశంపై తెలంగాణ ప్రభుత్వం వెంటనే శాసనసభలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని ఆయన కోరారు. ఆదివాసీ భాషలు, సంస్కృతుల పరిరక్షణ కోసం ఆదివాసీ సమాజం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. భాషా ప్రామాణీకరణ సదస్సు ద్వారా దేశవ్యాప్తంగా సుమారు 16 వేల మూల పదాలను సేకరించి నిఘంటువు రూపొందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ ఐక్య కార్యాచరణ సమితి నేత రామారావు దొర, తుడుం దెబ్బ రాష్ట్ర కోశాధికారి కల్తి రాంప్రసాద్, జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు పూనెం వరప్రసాద్, బచ్చల వెంకటేశ్వర్లు, చర్ప అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సామాజిక న్యాయం కోసం నిరంతరం కృషి చేస్తా

- **ఎస్సీ, ఎస్టీల సమస్యలను నా దృష్టికి తీసుకురావాలి: మంత్రి లక్ష్మణ్‌కుమార్**



హైదరాబాద్, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్‌కుమార్‌ను డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు శనివారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. హైదరాబాద్‌లోని పరిశ్రమల భవన్‌లో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో నాయకులు మంత్రిని సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సంఘాలు, సామాజిక సంస్థలకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించే దిశగా అనేక చర్యలు చేపడుతోందని, ప్రభుత్వం దళితుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజా సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, తెలంగాణ డీబీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రైతు రమేష్‌కుమార్, సర్వయ్య, ఆశ శ్రీరాములు, మెట్ల శంకర్, గూడపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంథని ఆనవాళ్లను చెరిపేసేలా వ్యవహరిస్తున్నారంటూ పుట్ట మధూకర్ ఆరోపణ

- **మార్కెట్ కూల్చి నాలుగు నెలలైనా పనులు ప్రారంభం కాలేదు..**
- **నమూనా రూపకల్పనకే ఇంత సమయం పడితే నిర్మాణం ఎప్పటికి పూర్తవుతుందని ప్రశ్న**



మంథని, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథనికి సంబంధించిన చారిత్రక ఆనవాళ్లను లేకుండా చేసేలా ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. నూతనంగా నిర్మించనున్న కూరగాయలు, మాంసం మార్కెట్ స్థలాన్ని శనివారం ఆయన పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులను ఫోన్‌లో ఆరా తీశారు. అనంతరం మీడియాతో పుట్ట మధూకర్ మాట్లాడుతూ.. మార్కెట్‌ను కూల్చివేసి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు తట్టెడు మట్టి కూడా తొలగించలేదని విమర్శించారు. మార్కెట్ నిర్మాణానికి సంబంధించిన నమూనా రూపకల్పనకే నాలుగు నెలలు పడితే, నిర్మాణం పూర్తయ్యేందుకు ఇంకా ఎన్నేళ్లు పడుతుందో ఎమ్మెల్యే, అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంథని ఏర్పడినప్పటి నుంచి ఈ మార్కెట్ కూడా కొనసాగుతోందని, తరతరాలుగా చిరువ్యాపారులు, కూరగాయలు, మాంసం వ్యాపారులు ఈ మార్కెట్‌పై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. మార్కెట్‌ను కూల్చివేసిన అనంతరం వ్యాపారులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మార్కెట్ పనులు ప్రారంభించడంలో జాప్యానికి కారణమేంటో అధికారులు స్పష్టం చేయాలని పుట్ట మధూకర్ కోరారు. పనులను ఎన్నికల వరకు సాగదీసే ప్రయత్నం జరుగుతోందనే అనుమానం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలను ఓట్లు అడిగేందుకు వచ్చే పాలకులను నియోజకవర్గంలో పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, పిల్లల భవిష్యత్తు కోసం ఏం చేశారో ప్రజలు ప్రశ్నిస్తారని అన్నారు. మంథని చరిత్రకు సంబంధించిన ప్రతి అంశానికి తన తండ్రి పేరు పెట్టేందుకు ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని పుట్ట మధూకర్ ఆరోపించారు. పురాతన ఆనవాళ్లను పరిరక్షించడంతో పాటు ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత పాలకులపై ఉందన్నారు.మార్కెట్ నిర్మాణం మరింత ఆలస్యమైతే చిరువ్యాపారులు తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. వచ్చే ఏడాది పుష్కరాల నాటికి మార్కెట్ అందుబాటులోకి రాకపోతే వ్యాపారులకు మరింత ఇబ్బంది ఏర్పడుతుందని అన్నారు. రెండు రోజుల క్రితం కాటారం మార్కెట్‌ను కూడా పరిశీలించానని, అక్కడా వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.తన తండ్రి గతంలో ఇదే మార్కెట్‌లో గొడ్ల అంగడి నిర్వహించేవారని, చిన్నప్పటి నుంచే ఈ మార్కెట్‌తో తనకు అనుబంధం ఉందని పుట్ట మధూకర్ తెలిపారు. అందుకే మార్కెట్ పరిస్థితిపై స్పందిస్తున్నానని చెప్పారు.మంథని మున్సిపల్ భవనం, ఆసుపత్రి వంటి ఇప్పటికే ఉన్న ప్రభుత్వ భవనాలను వినియోగించకుండా కొత్త నిర్మాణాల పేరుతో ప్రజాధనం ఖర్చు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మార్కెట్ పనులు ఎందుకు ప్రారంభించలేదో ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, అధికారయంత్రాంగం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంథని ప్రజల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందని పుట్ట మధూకర్ అన్నారు. ప్రజల జీవనోపాధి, వ్యాపారుల సమస్యలు, మంథని చారిత్రక ఆనవాళ్ల పరిరక్షణపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.




నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- **నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్**







ములుగు జిల్లా,అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లాలోని పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గోవిందరావుపేట మండలం బుస్సాపూర్, తాడ్వాయి మండలం మేడారం, వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామపంచాయతీల పరిధిలోని ఇళ్ల నిర్మాణాలను పరిశీలించిన కార్యదర్శి.. వివిధ దశల్లో ఉన్న పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులతో నేరుగా మాట్లాడి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం సకాలంలో వారి ఖాతాల్లో జమ అవుతుందా అని ఆరా తీశారు. ఆర్థిక సాయం సకాలంలో అందుతోందనీ, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్మాణ పనులు పారదర్శకంగా జరుగుతున్నాయని లబ్ధిదారులు వివరించారు.రెండో విడతలో అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని వి.పి. గౌతమ్ సూచించారు. ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న అర్హులకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. బిల్లుల మంజూరు విషయంలో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయకుండా, సకాలంలో వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులు మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, అర్హత ఆధారంగానే ఇళ్లు మంజూరు చేస్తామని గౌతమ్ స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మిగిలిన పనులను వేగవంతం చేసి ఇళ్లను త్వరగా లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్‌రావు, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణ ప్రసాద్, స్థానిక తహసీల్దార్లు, గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజినీర్లు, ఆయా గ్రామాల సర్పంచులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తల్లి లేని చిన్నారుల రోదనలు.. పోలీస్‌స్టేషన్‌లో విషాదం

- **24 ఏళ్ల వివాహిత ఆత్మహత్య.. మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యుల ఫిర్యాదు**



వర్ధన్నపేట, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): రాయపర్తి మండలం కొలనుపల్లికి చెందిన గాజుల దీక్ష (24) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదాన్ని నింపింది. దీక్ష మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరుతూ ఆమె కుటుంబసభ్యులు, బంధువులు వర్ధన్నపేట పోలీసులను ఆశ్రయించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో దీక్ష కుటుంబసభ్యులు, బంధువుల రోదనలతో విషాద వాతావరణం నెలకొంది. తల్లిని కోల్పోయిన రెండున్నరేళ్ల చిన్నారి, మరో తొమ్మిది నెలల పసిబిడ్డను చూసి బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. తల్లి లేని ఆ చిన్నారుల పరిస్థితిని చూసి అక్కడున్న వారు భావోద్వేగానికి గురయ్యారు. దీక్ష ఆత్మహత్యకు దారితీసిన కారణాలను పూర్తిస్థాయిలో విచారించి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు పోలీసులను కోరారు. ఘటనపై పోలీసులు విచారణ చేపట్టినట్లు సమాచారం. చిన్నారుల రోదనలు, కుటుంబసభ్యుల విలాపాలతో వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్ ఆవరణలో హృదయవిదారక వాతావరణం నెలకొంది.

పేద విద్యార్థినికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సైకిల్ అందజేత

- **పాఠశాలకు రాకపోకలకు సైకిల్ అందించిన సేవా తరుణి సభ్యులు**



తొర్రూరు, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి ఆధ్వర్యంలో తొర్రూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న పేద విద్యార్థిని శరణ్యకు సైకిల్‌ను అందజేశారు. విద్యార్థినుల విద్యాభ్యాసానికి, పాఠశాలకు సులభంగా రాకపోకలు సాగించేందుకు ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బ్రహ్మానందరెడ్డి హాజరయ్యారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు సేవా తరుణి అధ్యక్షురాలు రేణుకాదేవి, కార్యదర్శి ఎస్. నిత్య, క్లబ్ సభ్యులు జ్యోతి, విజయలు విద్యార్థినికి సైకిల్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జ్యోతి, సబీహాబాను, అశోక్‌రెడ్డి, వెంకన్నతో పాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతునేస్తం కార్యక్రమంలో సబ్సిడీ విత్తనాల పంపిణీ

- **యాసంగి సాగుకు రైతులు సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి**



ఎల్కతుర్తి, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): ఎల్కతుర్తి రైతు వేదికలో శనివారం రైతునేస్తం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి హనుమకొండ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఆదిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు యాసంగి సీజన్‌లో రైతులకు సబ్సిడీపై విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా ప్రారంభించారు. ప్రత్యక్ష ప్రసారం అనంతరం ఏ.డీ.ఏ. ఆదిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఇంద్రసేనారెడ్డి రైతు వేదికలో రైతులకు పెసర, మినుము విత్తనాలను సబ్సిడీపై పంపిణీ చేశారు. యాసంగి సాగుకు అవసరమైన సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. కార్యక్రమంలో బావుపేట సర్పంచ్ బత్తిని రవీందర్ గౌడ్, మండల వ్యవసాయ అధికారి ఎం. రాజ్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. పున్నంచందర్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

లింగాల గ్రామపంచాయతీకి రూ.50 లక్షల నిధులు మంజూరు

- సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించిన మంత్రి సీతక్క



ములుగు జిల్లా / తాడ్వాయి, అక్టోబర్ 30 (నిత్యం నిఘా ప్రతినిధి): తాడ్వాయి మండల పరిధిలోని లింగాల గ్రామపంచాయతీ అభివృద్ధికి పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దానసరి సీతక్క రూ.50 లక్షల నిధులు మంజూరు చేసినట్లు గ్రామ సర్పంచ్ మొగిలిపల్లి రవీందర్ తెలిపారు.మంజూరైన నిధులతో లింగాల గ్రామంలో ఏడు సీసీ రోడ్లు, కొడిశెల గ్రామంలో మూడు సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు.గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపి నిధులు మంజూరు చేసిన మంత్రి సీతక్కకు సర్పంచ్ రవీందర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వ హయాంలో మారుమూల గ్రామాలకు సైతం అభివృద్ధి కార్యక్రమాలు చేరుతున్నాయని అన్నారు.ప్రజల ఆశీర్వాదం ఉంటే గ్రామంలోని ప్రతి రహదారికి అవసరమైన నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తానని సర్పంచ్ రవీందర్ భరోసా కల్పించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చెన్నూరు సతీష్, మాజీ సర్పంచ్ ఊకే మౌనిక నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- కుడా అధికారులకు చైర్‌పర్సన్ గుండు సుధారాణి ఆదేశం



వరంగల్, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కుడా చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, జీడబ్ల్యూఎంసీ మాజీ మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు.శనివారం కుడా కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఇంజనీరింగ్, హార్టికల్చర్ అధికారులతో అభివృద్ధి పనులపై ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.వరంగల్ నగరానికి అత్యంత ప్రాముఖ్యత కలిగిన శ్రీ భద్రకాళి దేవాలయం మాడ వీధులు, ఇన్నర్ రింగ్ రోడ్డు, వరంగల్ బస్ స్టేషన్, గ్రీనరీ పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ సమావేశంలో కుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అజిత్‌రెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ ఆసిఫ్, అడ్మిని స్ట్రేటివ్ ఆఫీసర్ మీర్జా అస్రఫ్, డీఈ శ్రీకాంత్, ఏఈ భరత్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం నా బిడ్డను కొట్టి చంపారు

- మృతురాలు స్వర్ణలత తల్లి సుశీల ఆరోపణ
- మృతిపై సమగ్ర దర్యాప్తు చేసి వాస్తవాలు వెలుగులోకి తేవాలని డిమాండ్



ఏటూరునాగారం, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): అదనపు కట్నం కోసం తన కుమార్తె స్వర్ణలతను భర్త సోదారి హరీష్, అత్తమామలు వేధించి కొట్టి చంపారని మృతురాలి తల్లి సుశీల ఆరోపించారు. తన కుమార్తెను కొట్టి స్పృహ కోల్పోయిన అనంతరం నోట్లో పురుగుల మందు పోసి ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు.మండలంలోని రోహిర్ గ్రామంలో శుక్రవారం పురుగుల మందు తాగినట్లు చెబుతున్న స్వర్ణలత మృతి చెందిన విషయం తెలిసిందే. రోహిర్ గ్రామం నుంచి ఏటూరునాగారం సామాజిక వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆమె మృతి చెందినట్లు తల్లి సుశీల తెలిపారు.స్వర్ణలత ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి అని, ఆమెకు ఏడాది వయసున్న కుమారుడు కూడా ఉన్నాడని సుశీల చెప్పారు. తమకు సమాచారం ఇవ్వకుండానే ఆమెను ఆసుపత్రికి తరలించారని ఆరోపించారు. రాత్రి 12 గంటల సమయంలో కుమార్తె మృతదేహాన్ని చూసి తట్టుకోలేకపోయానంటూ ఆమె కన్నీరు మున్నీరయ్యారు.స్వర్ణలత మృతిపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టి, తమ కుమార్తె మృతికి గల వాస్తవ కారణాలను వెలుగులోకి తేవాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి.. ఆరుగురు అరెస్ట్

- భూమ్‌నగర్‌లో దాడి.. రూ.28,120 నగదు, పేకముక్కలు, ఏడు సెల్‌ఫోన్లు, స్కూటీ స్వాధీనం



పెద్దపల్లి, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): పెద్దపల్లి పట్టణంలోని భూమ్‌నగర్‌లో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న స్థావరంపై టాస్క్‌ఫోర్స్, పెద్దపల్లి పట్టణ పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు నార్కోటిక్ విభాగం టాస్క్‌ఫోర్స్ ఏసీపీ బి. శ్రీనివాసరావు నేతృత్వంలో గురువారం రాత్రి ఈ దాడి నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎస్ఐ దీకొండ రమేష్, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, పెద్దపల్లి పట్టణ పోలీసులు కలిసి భూమ్‌నగర్‌లోని ఓ స్థావరంపై ఆకస్మికంగా దాడి చేశారు. అనుమతులు లేకుండా డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కలాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి 52 పేకముక్కలు, రూ.28,120 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, ఒక స్కూటీని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పట్టుబడిన ఆరుగురిని, స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, ఇతర సామగ్రిని తదుపరి చట్టపరమైన చర్యల కోసం పెద్దపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. జిల్లాలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు, పేకాట స్థావరాలపై నిఘాను మరింత కఠినతరం చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

- రైతులకు మరిన్ని అవకాశాలు.. మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతం:ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి





వరంగల్/ సంగెం, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): సహకార సంఘాలను బలోపేతం చేయడంతో పాటు రైతులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. సంగెం మండలం రామచంద్రాపురం గ్రామంలో కాపులకనపర్తి సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల ఎరువుల గోదాం, వాణిజ్య సముదాయాన్ని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదతో కలిసి ఆయన ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాపులకనపర్తి సహకార సంఘం అంటే తనకు ప్రత్యేక గౌరవం ఉందన్నారు. సహకార వ్యవస్థ ద్వారా రైతుల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. సొసైటీ పరిధిలో 1,907 మంది రైతులకు రూ.14.77 కోట్ల మేర రుణమాఫీ చేసినట్లు తెలిపారు.

రైతుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న సహకార సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. రానున్న రోజుల్లో ఆహార శుద్ధి పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. స్థానిక నాయకత్వం సమర్థవంతంగా పనిచేస్తే ప్రభుత్వం నుంచి కూడా అదే స్థాయిలో ప్రోత్సాహం లభిస్తుందని అన్నారు.

రైతులకు అవసరమైన ఎరువులు అందుబాటులో ఉండేలా గోదాం, సొసైటీ కార్యకలాపాలకు ఉపయోగపడేలా వాణిజ్య సముదాయాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోందని, పరకాలలో మహిళల భాగస్వామ్యంతో ఇందిరా మహిళా డెయిరీని ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.

మహిళా సంఘాలతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

అనంతరం సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామంలో సంగెం సంగమేశ్వర మహిళా రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆహార ధాన్యాల నిల్వ గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సత్యశారదతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని సురక్షితంగా నిల్వ చేసుకునేందుకు గోదాం ఉపయోగపడుతుందని తెలిపారు.

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. దామెరలో మహిళల భాగస్వామ్యంతో పరకాల ఇందిరా మహిళా డెయిరీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

మహిళా సంఘాల ద్వారా పాడి పరిశ్రమను మరింత బలోపేతం చేసి గ్రామీణ మహిళలకు స్థిరమైన ఉపాధి, ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ప్రతి సమూహ స్థాయిలో ఆహార ధాన్యాల నిల్వ గోదాములను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కార్యక్రమాల్లో జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి విజయభాస్కర్, సొసైటీ చైర్మన్ దొమ్మటి సంపత్, స్థానిక సర్పంచ్ పులి రమేష్, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామశాఖ అధ్యక్షులకు ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఘన సన్మానం

- 33 గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులకు అభినందనలు
- అన్నారం షరీఫ్ నూతన అధ్యక్షుడిగా రామకృష్ణ





వరంగల్ /పర్వతగిరి, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయడంలో గ్రామశాఖ అధ్యక్షుల పాత్ర కీలకమని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అన్నారు. పర్వతగిరి మండలంలోని 33 గ్రామాల కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులను హన్మకొండ సుబేదారిలోని తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు.గ్రామాల్లో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామశాఖ అధ్యక్షులు పార్టీకి వెన్నెముక లాంటి వారని, సమన్వయంతో పనిచేసి కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.ఇదే సందర్భంగా పర్వతగిరి మండలం అన్నారం షరీఫ్ కాంగ్రెస్ గ్రామశాఖ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన భాషబోయిన రామకృష్ణను పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్ పిన్నింటి అనిల్ రావు, మండల పార్టీ అధ్యక్షులు ఇస్లావత్ సావిత్రి, గ్రామ సర్పంచ్ గాడిపల్లి మహేందర్, పాలకవర్గ సభ్యులు, గ్రామ ప్రజలకు రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.గ్రామంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రతి కార్యకర్తకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, పార్టీకి అంకిత భావంతో సేవ చేస్తానని రామకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్లు పిన్నింటి అనిల్ రావు, అత్తి కుమార స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బోట్ల మహేందర్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మెట్టపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడారం అభివృద్ధి పేరుతో మాటలు కాదు.. చేతల్లో చూపాలి

- 22-ఏ పేరుతో పేదల భూములను లాక్కోవాలని చూస్తున్న ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలి: బడే నాగజ్యోతి



ములుగు జిల్లా /తాడ్వాయి, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): ములుగు జిల్లా /తాడ్వాయి, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి):మేడారం అభివృద్ధికి రూ.300 కోట్లు ఖర్చు చేశామని చెబుతున్న ప్రభుత్వం ఆ అభివృద్ధిని క్షేత్రస్థాయిలో చూపించాలని ములుగు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి, మాజీ జెడ్పీ చైర్మన్ బడే నాగజ్యోతి డిమాండ్ చేశారు. తాడ్వాయి మండలంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.మేడారం పేరుతో ప్రచారం చేయడం కాదని, లక్షలాది మంది భక్తులకు అవసరమైన మరుగుదొడ్లు, తాగునీరు, పారిశుధ్యం, రవాణా వంటి మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించాలని నాగజ్యోతి అన్నారు. మేడారం అభివృద్ధికి రూ.300 కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్నప్పుడు ఆ అభివృద్ధి ఎక్కడ కనిపిస్తుందో మంత్రి సీతక్క సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.తాడ్వాయి మండలంలోని గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, ఇతర మౌలిక వసతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. అలాగే 22-ఏ జాబితా పేరుతో పేదలు, రైతులు ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూముల విషయంలో అనిశ్చితి నెలకొనడం ఆందోళనకరమని అన్నారు. పేదలు, రైతుల భూములపై హక్కులు కోల్పోయే పరిస్థితి రాకుండా ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని కోరారు.రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని నాగజ్యోతి అన్నారు. యూరియా కోసం రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందని ప్రశ్నిస్తూ, అవసరమైనంత ఎరువులను వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కష్టపడాలని పిలుపునిచ్చారు. పట్టభద్రులను కలిసి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు, పార్టీ విధానాలను వివరించాలని సూచించారు. నిరుద్యోగం, ఉద్యోగ అవకాశాలు, విద్యారంగ సమస్యలపై పట్టభద్రులతో నిరంతరం మమేకం కావాలని అన్నారు.ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి పోరాటాలను బలోపేతం చేయాలని, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని నాగజ్యోతి భరోసా ఇచ్చారు. 22-ఏ భూములు, యూరియా, మేడారం అభివృద్ధి, స్థానిక మౌలిక వసతుల సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.ఈ సమావేశంలో మాజీ మండల అధ్యక్షుడు దండుగుల మల్లయ్య, నుషిట్టి రమేష్, ఆత్మ మాజీ చైర్మన్ దుర్గం రమణయ్య, మేడారం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్లు కాక లింగయ్య, రేగ నర్సయ్య, మాజీ జడ్పీటీసీ రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి, కుడుముల లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పీఏసీఎస్ మాజీ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంగెంలో సీఐటీయూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ పోరాట దినం నిరసన

- కార్మికుల ఐక్యత, ప్రపంచ శాంతి కోసం నినాదాలు



వరంగల్ / సంగెం, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): అంతర్జాతీయ పోరాట దినం సందర్భంగా సంగెం మండల కేంద్రంలో వరంగల్ జిల్లా సీఐటీయూ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరూరి కుమార్, మండల అధ్యక్షులు దూపకి రాజు, మండల కార్యదర్శి లక్క నరేష్, లక్క మొగిలి, లోహిత గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.“అంతర్జాతీయ కార్మిక వర్గ ఐక్యత వర్ధిల్లాలి, సామ్రాజ్యవాదం నశించాలి, ప్రపంచ శాంతి వర్ధిల్లాలి” అంటూ నినాదాలు చేశారు. యుద్ధాలను నిలిపివేయాలని, సామ్రాజ్యవాద దురాక్రమణలను వ్యతిరేకించాలని వారు డిమాండ్ చేశారు. ప్రపంచ కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో లోహిత బిల్డింగ్ గ్రామ కమిటీ సభ్యులు చెరుకు సదానందం, బొమ్మర వీరస్వామి, దేవరాజు, పోగుల బిక్షపతి, కాటిపాకల రమేష్, దేవ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

లింగాలఘనపురంలో మండల స్థాయి సమీక్షా సమావేశం

- అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి: ఎంపీడీవోశివశంకర్‌రెడ్డి



లింగాలఘనపురం, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): మండలంలోని అన్ని గ్రామాల సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో అంకితభావంతో పనిచేయాలని ఎంపీడీవో కే. శివశంకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం లింగాలఘనపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొని, తమ శాఖల పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతి నివేదికలను సమర్పించారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సమీక్షించారు.ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాభివృద్ధికి అవసరమైన పలు కీలక పనులను తక్షణమే చేపట్టాలని అధికారులను కోరారు. సర్పంచులు లేవనెత్తిన సమస్యలపై ఎంపీడీవో శివశంకర్‌రెడ్డి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మండలంలోని అన్ని గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సమన్వయంతో భాగస్వాములు కావాలని ఎంపీడీవో కోరారు.



అనంతారం శివారులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- 5 మంది అరెస్ట్.. 7 మంది పరారీ.. రూ.1.29 లక్షల నగదు, కారు, 7 బైక్‌లు, 8 సెల్‌ఫోన్లు స్వాధీనం





వరంగల్ / పర్వతగిరి, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): పర్వతగిరి మండలం అనంతారం గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ బొగం ప్రవీణ్ ఆధ్వర్యంలో పోలీసులు పేకాట స్థావరంపై మెరుపుదాడి నిర్వహించారు.దాడి సమయంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకోగా, మరో ఏడుగురు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. వారి నుంచి రూ.1,29,490 నగదు, ఒక ఐ20 కారు, ఏడు ద్విచక్ర వాహనాలు, ఎనిమిది సెల్‌ఫోన్లు, పేకాట ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

అరెస్ట్ అయిన వారు..
శివరాత్రి వెంకటేష్ (33) – రంగశాయిపేట, వరంగల్
కుంచాల ఏడుకొండలు (55) – రామగోపాల్‌పురం
సుర సాంబరాజు (35) – రంగశాయిపేట
సుర సంతోష్ (33) – నాయుడుపాపం
బొంత కిషన్ (36) – నర్సంపేట

పరారైన ఏడుగురి కోసం గాలింపు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు. మండల పరిధిలో పేకాట, జూదం, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ బొగం ప్రవీణ్ హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి క్రీడలకు ఇల్లంద జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపిక

వరంగల్ / వర్ధన్నపేట, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మండలం ఇల్లంద జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు క్రీడల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (SGF) పోటీల్లో విద్యార్థులు వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచారు.

అండర్–14, అండర్–17 విభాగాల్లో ప్రతిభ
అండర్–14, అండర్–17 విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తదుపరి స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో సాధిస్తున్న విజయాలు పాఠశాలకు, గ్రామానికి గర్వకారణమని పేర్కొన్నారు.రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, గ్రామ పెద్దలు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీల్లోనూ ప్రతిభ కనబరిచి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని, చదువుతో పాటు క్రీడలను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయులు తెలిపారు.

ఇల్లంద పంచాయతీలో నిధుల వినియోగంపై విచారణ





వరంగల్ / వర్ధన్నపేట, అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామపంచాయతీలో సుమారు రూ.13 లక్షల నిధుల వినియోగంపై వివాదం నెలకొంది. గ్రామపంచాయతీ నిధుల వినియోగంలో నిబంధనలు పాటించలేదంటూ వార్డు సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో అధికారులు విచారణ చేపట్టారు.ఫిర్యాదు నేపథ్యంలో పంచాయతీ రికార్డులను పరిశీలించిన అధికారులకు సుమారు రూ.13 లక్షల నిధులకు సంబంధించిన తీర్మానాలు, బిల్లులు, ఎంబీ రికార్డులు, ఎస్టిమేషన్లు అందుబాటులో లేవన్న అంశాలు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇల్లంద గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శికి అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.సరైన తీర్మానాలు, ఎంబీ రికార్డులు, ఎస్టిమేషన్లు లేకుండా నిధులు డ్రా చేసినట్లు వచ్చిన అభ్యంతరాలపై వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలతో ఏడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారి కల్పన ఆదేశించినట్లు సమాచారం.

రూ.13 లక్షలపై అధికారుల విచారణ
పంచాయతీ నిధుల వినియోగంలో నిబంధనలు పాటించారా? తీర్మానాలు లేకుండానే నిధులు డ్రా చేశారా? ఎంబీ రికార్డులు, ఎస్టిమేషన్లు లేకుండా చెల్లింపులు ఎలా జరిగాయి? అనే ప్రశ్నలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.షోకాజ్ నోటీసులకు సంబంధిత సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి ఇచ్చే వివరణ ఆధారంగా అధికారులు తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులపై అధికారుల తదుపరి పరిశీలనతో ఈ వ్యవహారంలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే ఆధారాలు చూపాలి

- ఆరోపణలు చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవాలి:యువజన కాంగ్రెస్ నేత కుల్ల యాకాంతం



వరంగల్ / వర్ధన్నపేట, అక్టోబర్ 3 (నిత్యం నిఘా ప్రతినిధి): వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై ఆరోపణలు చేసే వారు వాటిని ఆధారాలతో నిరూపించాలని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కుల్ల యాకాంతం అన్నారు. ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజా ప్రతినిధిపై బురదజల్లే ప్రయత్నాలు చేయడం సరికాదని పేర్కొన్నారు.కేఆర్ నాగరాజును ప్రజలు తమ ఓట్లతో ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారని, ఆయన విజయాన్ని కేవలం ఎన్నికల ‘వేవ్’కు ఆపాదించడం ప్రజల తీర్పును తక్కువ చేసి చూపడమేనని యాకాంతం వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాలు, పార్టీ కార్యకర్తలకు గుర్తింపు వంటి అంశాలపై ఎమ్మెల్యే దృష్టి సారిస్తున్నారని తెలిపారు.పార్టీ పట్ల నిబద్ధత, సేవా నేపథ్యం, కార్యకర్తల అభీష్టానికి ప్రాధాన్యత ఇస్తూ పదవుల విషయంలో అవకాశాలు కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. రాజకీయ నేపథ్యం లేని యువతకు కూడా అవకాశాలు కల్పిస్తూ కొత్త నాయకత్వాన్ని ప్రోత్సహిస్తున్నారని అన్నారు.ఎమ్మెల్యేపై ఇటీవల చేసిన ఆరోపణలకు ఆధారాలు ఉంటే వాటిని ప్రజల ముందు ఉంచాలని యాకాంతం డిమాండ్ చేశారు. మీడియా వేదికగా ఆరోపణలు చేసే ముందు క్షేత్రస్థాయిలో వాస్తవాలను పరిశీలించాలని సూచించారు.“ఆరోపణలు చేయడం సులభం.. కానీ నిరూపించడానికి ఆధారాలు కావాలి. వాస్తవాలను తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదు” అని కుల్ల యాకాంతం అన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కరువు కోరల్లో నల్లబెల్లి..
కరువు మండలంగా ప్రకటించాలి

- వర్షాభావంతో ఎండుతున్న చెరువులు..
- పంటలు పండక రైతుల అవస్థలు
- మండల సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం..
- అధికారుల గైర్హాజరుపై సభ్యుల అసహనం





నల్లబెల్లి, అక్టోబర్ 03
(నిత్యం నిఘా ప్రత్యేక కథనం):
వర్షాభావ పరిస్థితులతో నల్లబెల్లి మండలంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి రైతాంగాన్ని ఆదుకోవాలని మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. శనివారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేసి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వర్షాలు లేక చెరువులు నిండక పోవడం, పంటలు పండకపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ్యులు పేర్కొన్నారు.

అధికారుల గైర్హాజరుపై అసహనం
మండలంలోని 29 గ్రామపంచాయతీలకు గాను 18 మంది సర్పంచులు, 29 శాఖలకు గాను 17 శాఖల అధికారులు మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. 12 శాఖల అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం సభ్యులు, అధికారులు ఆలస్యంగా రావడంతో 11 గంటలకు ప్రారంభమైంది. ముఖ్యమైన శాఖల అధికారులు సమావేశానికి హాజరుకాకపోవడంతో సమస్యలను ఎవరికి వివరించాలంటూ సభ్యులు ప్రశ్నించారు.

సర్పంచ్ దంపతులకు సంతాపం
ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లెంకాలపల్లి సర్పంచ్ దంపతులు కస్తూరి విజయలక్ష్మి, రవీందర్ల మృతికి సభ సంతాపం తెలిపింది. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

తొమ్మిది నెలలుగా అంగన్వాడీ కేంద్రానికి తాళం
రామతీర్థం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో టీచర్ తొమ్మిది నెలలుగా విధులకు హాజరు కావడం లేదని సర్పంచ్ పొదిల వసంత శోభన్ సభ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో చిన్నారులు, తల్లులు, గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యపై చర్యలు తీసుకుంటామని ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్వైజర్ హేమలత హామీ ఇచ్చారు.

వేసవిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు
మండలంలో 175 సింగిల్ఫేస్, త్రీ ఫేస్ మోటార్ల ద్వారా 81 ఓవర్హెడ్ నీటి ట్యాంకులకు నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సభ్యులు కోరారు. నీటి ట్యాంకులు, చేతిపంపుల వద్ద నీటి వృథాను అరికట్టడంతో పాటు ఇంకుడు గుంతల ఏర్పాటుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని అధికారులు వివరించారు.

భూమి ఉన్న చోట పట్టా లేదు..
పట్టా ఉన్న చోట భూమి లేదు
మండలంలో భూములు ఉన్నవారికి పట్టాలు లేకపోవడం, పట్టాలు ఉన్నవారికి క్షేత్ర స్థాయిలో భూములు కనిపించకపోవడం వంటి సమస్యలు నెలకొన్నాయని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. భూ పునఃసర్వే పనులను వేగవంతం చేయాలని కోరారు. మార్చి 31లోపు సర్వే పూర్తి చేస్తామని తహసీల్దార్ ముప్పు కృష్ణ తెలిపారు. అయితే 29 గ్రామాల్లో ఇంత తక్కువ సమయంలో సర్వే ఎలా పూర్తవుతుందని అరువయ్యపల్లె సర్పంచ్ మాలోతు రాంలాల్ ప్రశ్నించారు.

గ్రామాలకు వైద్య సేవలు చేరాలి
మండలంలో విషజ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో గ్రామీణ ఆరోగ్య ఉపకేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండడం లేదని సభ్యులు ఆరోపించారు. వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నప్పటికీ సర్పంచులకు సమాచారం ఇవ్వడం లేదని బజ్జుతండా, ముచ్చింపుల సర్పంచులు జాటోత్ రవి, చిన్న ఇస్తారి శేఖర్ తెలిపారు. ఇకపై సర్పంచులకు సమాచారం అందించి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని మండల వైద్యాధికారులు ఆచార్య, మేడిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి జ్యోతి తెలిపారు.

లోవోల్టేజీతో రైతులకు ఇబ్బందులు
చెరువుల్లో నీరు లేక బోర్లపై ఆధారపడుతున్న రైతులకు లోవోల్టేజీ సమస్య తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోందని సభ్యులు తెలిపారు. సుమారు 60 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, తీగలు శిథిలావస్థకు చేరాయని, వాటిని వెంటనే మరమ్మతులు చేయాలని విద్యుత్ శాఖ అధికారి కృష్ణకాంత్ను కోరారు

గోదావరి నీటితో చెరువులు నింపాలి
వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న నల్లబెల్లి మండలంలో వర్షాభావం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని బజ్జుతండా సర్పంచ్ జాటోత్ రవి తెలిపారు. దేవాదుల ప్రాజెక్టు నుంచి రామప్ప పంపుహౌస్ పైప్లైన్ ద్వారా నల్లబెల్లి మండలంలోని చెరువులకు గోదావరి నీటిని తరలించాలని కోరారు. దీంతో వేసవిలో తాగునీరు, పశువుల నీటి సమస్యలను కొంతమేర పరిష్కరించవచ్చని తెలిపారు.

రైతులకు రాయితీలు అందించాలి
వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించాలని ముచ్చుపులతండా సర్పంచ్ రవి కోరారు. ఎస్సీ, ఎస్టీ రైతులు బిందు సేద్యం, మల్చింగ్ వంటి రాయితీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి జ్యోతి సూచించారు. రైతులు నమోదు చేసుకున్నప్పుడే వ్యవసాయ రాయితీలు అందుతాయని వ్యవసాయ అధికారి రజిత తెలిపారు.

బస్సు సర్వీసులు పెంచాలి
నల్లబెల్లి నుంచి హైదరాబాద్తో పాటు వేములవాడ రాజరాజేశ్వర స్వామి దర్శనానికి బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని సభ్యులు కోరారు. వరంగల్, నల్లబెల్లి, నర్సంపేట, ములుగు ప్రాంతాలకు సర్వీసులు పెంచాలని సర్పంచులు జాటోత్ రవి, జ్యోతి ప్రకాశ్ తదితరులు కోరారు.

అన్ని శాఖల అధికారులు హాజరు కావాలి
మండల సర్వసభ్య సమావేశాలకు చెరువులు, నీటిపారుదల శాఖ డీఈతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమం, బీసీ, ఎస్సీ, ఎస్టీ సహకార సంస్థలు, గిరిజన సహకార సంస్థ, సహకార సంఘాలు, నీటిపారుదల, రహదారులు, గ్రంథాలయం, మత్స్యశాఖల అధికారులు గైర్హాజరు కావడంపై సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

మహిళా సంఘాల రుణాలపై ఫిర్యాదులు
బ్యాంకుల్లో రైతుల రుణాలను అడ్డుపెట్టుకుని మహిళా సంఘాల సభ్యులకు మంజూరైన రుణాలను అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని పలువురు సర్పంచులు ఆరోపించారు. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న మహిళలను మరింత ఇబ్బందులకు గురిచేయకుండా సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో పింగిలి రమణారెడ్డి, తహసీల్దార్ ముప్పు కృష్ణ, ఎంపీవో రవి, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.

కష్టాల కొలిమిలో కరిగిన ప్రస్థానం.. యాదగిరిగౌడ్ మనసులో మాట

శనివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా 'నిత్యం నిఘా'తో తన జీవిత ప్రయాణాన్ని పంచుకున్న బొనగాని యాదగిరిగౌడ్





హనుమకొండ , అక్టోబర్ 03 (నిత్యం నిఘా ప్రత్యేక కథనం): సాధారణ కుటుంబంలో జన్మించి.. కష్టాలను ఎదుర్కొంటూ ముందుకు సాగారు. చదువుకున్నారు.. కాంట్రాక్టర్గా పనిచేశారు.. ఎల్ఐసీ ఏజెంట్గా ప్రజలకు చేరువయ్యారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టి కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్నారు. పదవులు, గుర్తింపు కోసం ఎదురుచూస్తూనే పార్టీ కోసం పనిచేశారు. మరోవైపు గౌడ కులస్తుల సమస్యలపై తనవంతు పోరాటం చేస్తూ ముందుకు సాగారు. ఆయనే బొనగాని యాదగిరిగౌడ్. శనివారం ఆయన పుట్టినరోజు సందర్భంగా 'నిత్యం నిఘా' పలకరించింది. సాధారణంగా పుట్టినరోజు అంటే శుభాకాంక్షలు, సంబరాలు, వేడుకలు. కానీ యాదగిరిగౌడ్తో మాట్లాడినప్పుడు ఆయన మాటల్లో ఆనందం కంటే జీవితంలో ఎదురైన కష్టాలు, రాజకీయంగా ఎదురుచూసిన గుర్తింపు, కార్యకర్తగా తాను పడిన ఇబ్బందులు, సామాజిక సేవలో చూసిన బాధలు ఎక్కువగా వినిపించాయి. తన మనసులో దాచుకున్న ఎన్నో విషయాలను ఆయన 'నిత్యం నిఘా'తో పంచుకున్నారు.

చిన్ననాటి నుంచి కష్టాల ప్రయాణం
ములుగు జిల్లా గోవిందరావు పేట మండలం చల్వాయి గ్రామ ప్రాంతానికి చెందిన బొనగాని బక్కయ్య, సమ్మక్క దంపతులకు ఎనిమిది మంది సంతానం. వారిలో ఏడో వ్యక్తి యాదగిరిగౌడ్. చల్వాయిలో పదో తరగతి, గోవిందరావుపేటలో ఇంటర్మీడియట్, ములుగులో డిగ్రీ, హనుమకొండ ఆదర్శ కళాశాలలో న్యాయ విద్యను అభ్యసించారు.
చదువు పూర్తయిన తర్వాత సివిల్ కాంట్రాక్టర్గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. ఎల్ఐసీ ఏజెంట్గా కూడా పనిచేస్తూ ప్రజలకు చేరువయ్యారు. వచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని కార్యకర్తలకు, స్వచ్ఛంద సంస్థలకు, ఆపదలో ఉన్న వారికి సహాయంగా అందిస్తూ వచ్చానని ఆయన తెలిపారు.

కాంగ్రెస్ను నమ్ముకుని..
కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో ఆ పార్టీలో సభ్యత్వం తీసుకున్న యాదగిరిగౌడ్ 2003లో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతమైన ములుగు నుంచి పార్టీ కోసం పనిచేసిన రోజులను ఆయన గుర్తుచేసుకున్నారు.
తన రాజకీయ గురువుగా పొదెం వీరయ్యను పేర్కొన్న యాదగిరిగౌడ్.. రాజకీయంగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీని మాత్రం వీడలేదని చెప్పారు. పార్టీ కోసం పనిచేసినప్పటికీ తనకు తగిన గుర్తింపు, సహాయం లభించలేదనే ఆవేదనను వ్యక్తం చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఉంటే కార్యకర్తలకు, తనలాంటి వారికి తగిన స్థానం లభించేదనే ఆశ ఉండేదని, ఆయన మరణం తమకు తీరని లోటుగా మిగిలిందని యాదగిరిగౌడ్ తన మనసులోని మాటను పంచుకున్నారు.

గౌడ కులస్తుల కోసం మరో పోరాటం
రాజకీయాలతో పాటు గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కూడా యాదగిరిగౌడ్ తన వంతు కృషి చేస్తున్నారు. జిల్లా కార్యదర్శిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతల వరకు కొనసాగింది. గౌడ వృత్తిలోని కష్టాలను చిన్ననాటి నుంచే
దగ్గరగా చూశానని ఆయన చెప్పారు. తాటి చెట్లపై పనిచేస్తూ ప్రమాదాలకు గురయ్యే గౌడ కులస్తుల పరిస్థితులు తనను ఎంతో కలచివేశాయని తెలిపారు. ప్రమాదాల్లో మృతిచెందిన కుటుంబాలకు తగిన పరిహారం అందాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందాలని కోరుతూ బాధితుల వెంట ఆసుపత్రుల వరకు వెళ్లిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. వరంగల్తో పాటు హైదరాబాద్లోని నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి బాధితులను పరామర్శించిన సందర్భాలు, వారి వైద్యానికి అవసరమైన సహాయం కోసం ప్రయత్నించిన రోజులను ఆయన గుర్తుచేసుకున్నారు.

పుట్టినరోజు వేళ.. మనసులోని మాట
పుట్టినరోజు సందర్భంగా 'నిత్యం నిఘా'తో మాట్లాడిన యాదగిరిగౌడ్ మాటల్లో ఒక కార్యకర్తగా తన ప్రయాణం, ఎదురైన కష్టాలు, తనకు దక్కని గుర్తింపు, సమాజం కోసం చేయాలనే తపన స్పష్టంగా కనిపించింది. జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గకుండా తనకు చేతనైనంత వరకు కార్యకర్తలకు, గౌడ కులస్తులకు, ఆపదలో ఉన్న వారికి అండగా నిలవాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్నానని ఆయన తెలిపారు. బొనగాని యాదగిరిగౌడ్ పుట్టినరోజు సందర్భంగా 'నిత్యం నిఘా' తరఫున హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com